: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified


గౌరవ సంపాదకులు
ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు
ఉపకులపతి (FAC)

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్


సంపుటి : 3 | సంచిక : 27 | 03-04-2023 | పుటలు : 4





## మంచిమాట

అపవిత్ర కార్యం ఎంత చెడ్డదో అపవిత్ర ఆలోచన కూడా అంతే చెడ్డది.

Unchaste imagination is as bad as unchaste action.

- స్వామి వివేకానంద



# కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ క్లాస్ రూమ్ ప్రారంభం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడలో ఓఎన్జిసి వారు సి ఎస్ ఆర్ ఫండ్ తో అభివృద్ధి పరచిన కంప్యూటర్ ల్యాబ్ మరియు డిజిటల్ క్లాస్ రూమ్ ను ఓఎన్జిసి మహిళా సమితి అధ్యక్షురాలు భబిత పి.కుమార్, వీసీ ప్రొఫెసర్ జి.వి.ఆర్ ప్రసాద్ రాజు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ ఓఎన్జిసి కంపెనీ సి ఎస్ ఆర్ ఫండ్ ద్వారా ఎంఎస్ఎన్ క్యాంపస్ కి 16 లక్షల 50 వేల ఆర్థిక సహాయంతో అభివృద్ధి పరిచిన డిజిటల్ క్లాస్ రూమ్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, రాబోవు కాలంలో మరిన్ని సహాయ సహకారాలు అందించాలని అన్నారు.ఇటువంటి అభివృద్ధి కార్యక్రమానికి కృషి చేసిన క్యాంపస్ ప్రిన్సిపల్ డా.కమలకుమారి, వీటికి ముందుగా సహాయ సహకారాలు చేసినటువంటి ఫార్మర్ స్పెషల్ ఆఫీసర్ ఎస్. ప్రశాంతి శ్రీ, క్యాంపస్ అధ్యాపకులు డా.ఎం. శ్రీరామరాజును అభినందించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఓఎన్జిసి మహిళా సమితి అధ్యక్షురాలు శ్రీమతి బబిత కుమార్ మాట్లాడుతూ " ఓ ఎన్ జి సి ఎన్నో విద్యార్థికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకి ఎప్పుడు తమ వంతు సహాయ సహకారాలు, అందిస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం డిజిటల్ ఇండియా వంటి ఎన్నో రకాల పథకాలు ప్రవేశపెట్టి భారతదేశాన్ని డిజిటల్ వైపు పరుగులు పెట్టిస్తున్న సందర్భంలో ఈ క్యాంపస్ కి ఓఎన్జిసి డిజిటల్ క్లాస్ రూమ్ నిమిత్తం సి ఎస్ ఆర్ ఫండ్ ని అందించడం నిజంగా హర్షదాయకమన్నారు. విద్యార్థులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకున్నప్పుడే ఓ ఎన్ జి సి సంకల్పానికి నిజమైన గుర్తింపు అని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. కమల కుమారి, ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ ప్రసాద్ రాజు, బబిత కుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రశాంతి శ్రీ, ఓ న్ జి సి జనరల్ మేనేజర్ డాక్టర్ మాలిక్ ,ఆర్ శంకర్, అన్వర్, లక్ష్మీ సురేష్ ఓఎన్జిసి అధికార బృందం, క్యాంపస్ అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వీసి ప్రసాదరాజు

## ఎంపీ భరత్‌ను కలిసిన వీసీ ప్రసాదరాజు


ఎంపీ భరత్ ను కలిసిన వీసీ

రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ ను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవల కాలంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వీసీ వివరించారు. ఎంపీ సహకారంతో కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన క్రీడాభివృద్ధికి సంబంధించిన పనులు జరుగుతున్నాయని చెప్పారు. అలాగే యూనివర్సిటీలో నాలుగు వందల మీటర్ల సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ నన్నయ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. తొలిసారిగా యూనివర్సిటీకి కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు తీసుకువచ్చి క్రీడాభివృద్ధికి సంబంధించిన పనులు చేపట్టామని, అలాగే సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలియజేసారు.

# భూగర్భ జలాల పరిరక్షణ అందరి బాధ్యత

**28.03.23 (మీడియాసెల్)**

నేటి కాలంలో సహజసిద్ధమైన మంచి నీరే కరువైందని భవిష్యత్ లో నీటి సమస్యలు మరింత అధికమవుతాయని, కాబట్టి భూగర్భ జలాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ తెలిపారు. మంగళవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ సెమినార్ హాల్ లో నేషనల్ హైడ్రోలజీ ప్రోజెక్ట్ లో భాగంగా "గ్రౌండ్ వాటర్ మోనటరింగ్ అండ్ సస్టైనబుల్ డెవలప్మెంట్ ఆఫ్ గ్రౌండ్ వాటర్ రిసోర్స్ ఇన్ ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్" అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కన్వీనర్ గా గ్రౌండ్ వాటర్ డిపార్టమెంట్ డిప్యూటీ డైరెక్టర్ వై.శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డిస్ట్రిక్ వాటర్ మేనేజ్మెంట్ ఎజెన్సీ ప్రోజెక్ట్ డైరెక్టర్ రామ్ గోపాల్, అగ్రికల్చర్ డిపార్టమెంట్ జాయింట్ డైరెక్టర్ మాధవరావు, జియోసైన్సెస్ విభాగాధిపతి ఆచార్య వై.శ్రీనివాసరావు, యూనివర్సిటీ ఇంజనీర్ డా.కె.నూకరత్నం హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ పూర్వం నదులలో నీటిని నేరుగా త్రాగేవారమని ప్రస్తుత కాలుష్య వాతావరణంలో మంచి నీటిని కొనుక్కుని త్రాగుతున్నామని అన్నారు. వాతావరణంలో కాలుష్యం, నీటిని దుర్వినియోగం చేసుకోవడం ద్వారా భూగర్భజలలు తగ్గుతున్నాయని ఇది మానవ మనుగడకు ప్రమాదమని అన్నారు. కాబట్టి భూగర్భ జలాల పరిరక్షణపై అందరూ దృష్టి సారించాలని తెలియజేసారు. వాటర్ మేనేజ్మెంట్ ఎజెన్సీ ప్రోజెక్ట్ డైరెక్టర్ రామ్ గోపాల్ మాట్లాడుతూ జలశక్తి అభియన్ పథకంలో భాగంగా జిల్లాలోని భూగర్భ జల సంరక్షణ కట్టడాలను నిర్మిస్తున్నామన్నారు. విద్యార్థులు భూగర్భ జల పరిరక్షణపై అవగాహన పెంచుకొని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరిస్థితులను మరింత మెరుగుపరచాలని తెలిపారు. అగ్రికల్చర్ డిపార్టమెంట్ జాయింట్ డైరెక్టర్ మాధవరావు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో మంచి నీరు దొరకని ప్రాంతాలు ఉన్నాయని, విద్యార్థులంతా భూగర్భజలాలను పెంపొందించడంలో భాగంగా తమవంతుగా ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. ప్రోగ్రామ్ కన్వీనర్ గ్రౌండ్ వాటర్ డిపార్టమెంట్ డిప్యూటీ డైరెక్టర్ వై.శ్రీనివాస్ మాట్లాడుతూ భూగర్భ జలాలను పెంపొందించేందుకు భూగర్భజలశాఖ, డ్వామ, వ్యవసాయశాఖ, జియోసైన్సెస్ విభాగం సంయుక్తంగా చక్కని కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్ ను నిర్ధేశిస్తాయని, మానవ మనుగడకు ఎంతో ఉపయోగపడతాయని తెలియజేసారు. విద్యార్థులంతా భూగర్భజల సంరక్షణలో భాగస్వామ్యం కావాలి సూచించారు. గ్రౌండ్ వాటర్ డిపార్టమెంట్ హైడ్రోజియోలజిస్ట్ డి.లక్ష్మిప్రత్యూష సంబంధిత అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ అందజేసారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రోజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, గ్రౌండ్ వాటర్ డిపార్టమెంట్ హైడ్రోలజిస్ట్ ఎం.శివరామకృష్ణ, జియోఫిజిస్ట్ జి.రాధాకృష్ణ, విభాగాచార్యులు డా.కె.విస్వామి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ అశోక్

## సంపాదకీయం



# కబ్జా

మన దగ్గరున్న విలువైన వస్తువుల కన్నా మనమే ముఖ్యమైన వాళ్ళం. జీవితాన్ని మించిన మరొక కానుక ఇంకేముంటుంది. జీవితాన్ని గడిపేందుకు ప్రశాంతంగా ఉండటం ఒక తెలివైన, తేలికైన పద్ధతి. మనం ఆశా జీవులం. ఈ ప్రపంచాన్ని సంతోషంగా మనకనువుగా ఉండేలా మార్చుకోవాలనుకుంటూ ఉంటాం.

సంతోషంగా ఉన్న వారిని చాలా జాగ్రత్తగా గమనించండి. వాళ్లు మంచినే వెతకటానికి బ్రతుకుతున్న వాళ్ళని మనకర్థమౌతుంది. చెడును ఎదిరించే ఆత్మస్థైర్యం వాళ్ళల్లో ఉంది. కానీ వాళ్ళు దాని జోలికి వెళ్ళరు. దానికి చేయాల్సిన మేజిక్ మనలోని శక్తుల్ని మరింత బలపరుచుకోవటం. బలహీనతల్ని మరింత బలహీన పరచటం. ఇంతే.

మనమేది తింటే అదే తేనుపొస్తుంది. పులిహోర తింటే బిరియానీ తేనుపు రాదుకదా! నిజాయితీగా ప్రవర్తించే, మాట్లాడే వ్యక్తులతో కలసిమెలసి ఉండటమే గొప్ప మార్గం. అటువంటి వారిని పరిశీలిస్తున్నప్పుడు వారిమాటల్లో మీరు, మనం పదాలు ఎక్కువగా వినిపిస్తాయి. నేను, నాకు పదాల ప్రయోగం తక్కువగా ఉంటుంది. మన దగ్గర దాచవలసిన విషయాలు ఏమీ లేకపోతే మనం ఇతరుల నుంచి తప్పించుకోవలసిన అవసరం కూడా ఉండదు.

ఇతరుల ఆస్తుల్ని, స్థలాల్ని, ఇళ్ళను, పార్కింగ్ ప్లేసులను, ప్రభుత్వ స్థలాలను కాదు కబ్జా చేయటం. వారి మనసులని కబ్జా చేద్దాం. ఇతరుల హృదయాల్లో మనకు చోటుండేలా కబ్జా చేయాలి.

వస్తువుల్ని ప్రేమించకూడదని మనుషుల్ని ప్రేమించాలని వస్తువులు ఉపయోగించుకోవటానికి మాత్రమే అనే విషయాన్ని అర్థం చేసుకున్న వాళ్ళు చాలా అనుబంధాన్ని కలిగి ఉంటారు. అంతేకాదు, చాలా ఆనందంగా జీవిస్తుంటారు కూడా.

ఇష్టమైనది చేయటం, లేదంటే చేస్తున్న డ్యూటీని ఇష్టపడటం ఈ రెండే మన చేతిలో ఉన్నవి. మరో అంశమేమిటంటే సమాజంలో అందరూ మారాలనుకోవడం దురాశే. మన వైఖరుల్ని మార్చుకోవటమే ముఖ్యమైన అంశం.

"నా మీద వేసిన విమర్శల్ని నేను ఎలాగూ నాతో మోసుకెళ్ళను. అవి విమర్శించిన వారితోనే ఉంటాయి కాబట్టి అవి నన్ను ఎలా బాధిస్తాయి" అంటారు గౌతమ బుద్ధ. ఇతరుల మీద బురద చల్లాలంటే ముందు మన చేతుల్ని బురదలో పెట్టి ముందు మనం బురదవ్వాలి. సన్మానించాలనుకుంటే గంధంలో మన చేతులనుంచాలి. ముందు మనం సన్మానింపబడతాం. ఇంతే లాజిక్. ఇది చాలామంది మిస్సవుతుంటారు.

మాటల్లో చెప్పలేని ఆలోచనలతో నిండిపోయిన మహా సముద్రమే మనసు. సంబంధాలు, అనుబంధాలు విత్తనాల్లాంటివి. పోషించి పెంచితేనే మొక్కలై చెట్లవుతాయి. కొమ్మలుగా విస్తరిస్తాయి. ఒక అనుబంధంలో కావలసినంత భావనాత్మకమైన అనుభూతులు, జ్ఞాపకాలు ఉంటే మాత్రమే సహించటం, క్షమించటం తేలికౌతుంది.

అన్నిటికన్నా హృదయ వైశాల్యం గొప్పదని తెలుసుకున్నవాళ్లు హాయిగా ఉంటారు. అంతే!!

# నన్నయలో రక్తదాన శిబిరం ప్రారంభించిన రిజిస్ట్రార్

**28.03.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఎన్.ఎస్.ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఫైనల్ ఇయర్ ఇంజనీరింగ్ విద్యార్థులచే రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మంగళవారం డా.బి.ఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులచే పెద్దఎత్తున రక్తదాన శిబిరాన్ని నిర్వహించారని తెలిపారు. యూనివర్సిటీలోని 60 మంది విద్యార్థులు సహృదయంతో ముందుకు వచ్చి రక్తాన్ని దానం చేసారని చెప్పారు. రెండేళ్ళ క్రితం అనారోగ్యంతో మృతి చెందిన తమ స్నేహితుడు సందీప్ జ్ఞాపకార్థం ఇంజనీరింగ్ విద్యార్థులు రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. రాజమండ్రిలోని సంజీవని వాలంటరీ బ్లడ్ సెంటర్ సిబ్బంది చక్కని వసతులను రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. రక్తం ప్రాణాధారమని, ఎంత సొమ్ము చెల్లించిన




రక్తాన్ని కొనుగోలు చేయలేమని చెప్పారు. విశ్వవిద్యాలయంలో మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యార్థులను, వారికి మార్గనిర్దేశం చేసిన ఎన్.ఎస్.ఎస్ విభాగాన్ని, అధ్యాపకులను అభినందించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు సంజీవని బ్లడ్ బ్యాంక్ వారు సర్టిఫికెట్లు, బ్లడ్ గ్రూప్ కీచైన్ ను అందజేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.పి.వేంకటేశ్వరరావు, డీన్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, ఆచార్య కె.రమణేశ్వరి, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ ఎ.ఎం.శిరిష, డా.డి.అప్పలరాజు, యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్ పిఓ లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చైల్డ్ సైకాలజీపై పట్టు సాధించాలి

## ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి

**31.03.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో చైల్డ్ అండ్ అడోలెసెంట్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ పీజీ డిప్లొమా కోర్సులో ప్రవేశం పొందిన విద్యార్థులంతా ప్రత్యేక శ్రద్ధతో చైల్డ్ సైకాలజీపై పట్టు సాధించాలని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి అన్నారు. శుక్రవారం డా.బి.ఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలోని సైకాలజీ ల్యాబ్ లో పీజీ డిప్లొమా చైల్డ్ అండ్ అడోలెసెంట్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ కోర్సుకు సంబంధించిన తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా టేకి మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక కాలంలో మానవ జీవితంలో ఒత్తిళ్ళు అధికమవుతున్నాయని, వాటిని అధిగమించి ప్రశాంత జీవితాన్ని జీవించడం చాలా కష్టతరమవుతుందని అన్నారు. గతంలో మాదిరిగా స్వేచ్ఛాయుత బాల్యం నేటితరానికి దూరమవుతుందని, ఈ నేపథ్యంలో చైల్డ్ సైకాలజీ వంటి కోర్సుల ఆవశ్యకత ఎంతో పెరిగిందని చెప్పారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, చక్కని వాతావరణం మధ్య కోర్సును పూర్తిచేయాలని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసారు. కోర్సు కోఆర్డినేటర్ డా.నక్కిన నారాయణ మాట్లాడుతూ చైల్డ్ అండ్ అడోలెసెంట్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ పీజీ డిప్లొమా కోర్సును యూనివర్సిటీలో ప్రారంభించేందుకు సహకరించిన వీసీ, రిజిస్ట్రార్, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులంతా క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగ ఆచార్యులు డా.పడాల రాజశేఖర్, డా.సిహెచ్. భవాని పాల్గొన్నారు.




సైకాలజీ ల్యాబ్ లో చైల్డ్ సైకాలజీ ప్రారంభమైన తరగతులు

# ఫార్మసీ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం ఫార్మసీ విభాగం వారు బెంగళూరు లోని ఫార్మసీ పరిశ్రమల సందర్శనకు వెళ్లారు. అలాగే మైసూర్ నగరాన్ని సందర్శించారు. పారిశ్రామిక సందర్శనలో భాగంగా చివరి సంవత్సరం విద్యార్థులు గ్రూప్ ఫార్మాస్యూటికల్స్ మరియు సంరిసా కాస్మెటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లను సందర్శించారు, అక్కడ వారు సౌందర్య సాధనాలు, మరియు మెడికల్ క్రీమ్‌లు, పేస్ట్‌లు, ఆయింట్‌మెంట్లు, సిరప్‌లు మొదలైన వాటి తయారీ పద్ధతులను అలానే వాటి యొక్క సాంకేతికత నేర్చుకున్నారు.



పారిశ్రామిక సందర్శనకు అనుమతించిన రెండు ఫార్మాస్యూటికల్ కంపెనీలకు సందర్శనకు వెళ్ళిన విద్యార్థులందరూ కృతజ్ఞతలు తెలిపారు. అలానే సందర్శనకు అనుమతి కోరిన వెంటనే మంజూరు చేసిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. అశోక్ మరియు క్యాంపస్ ఇంచార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శ్రీరమేష్ ఫార్మసీ సిబ్బంది డాక్టర్ హీరా బట్టు, శ్రీ కె. నిత్యానందన్ రెడ్డి, శ్రీమతి ఎస్. లిఖిత మరియు శ్రీమతి పి. అరుణ మరియు బి.ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థులు ధన్యవాదాలు తెలియజేశారు.



నేను మిమ్ములను ప్రేమించినట్లే, మీరును ఒకరి యెడ ఒకరు ప్రేమను కలిగి ఉండండి.

**ఈస్టర్ శుభాకాంక్షలు!!**

- నన్నయవాణి

# రావిశాస్త్రి సాహితి పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ

**31.03.23 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధిపతి డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్ సంపాదకులుగా ప్రచురించిన రావిశాస్త్రి సాహితి పుస్తకాన్ని వీసీ ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు విడుదల చేసారు. శుక్రవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో వీసీ ఆచార్య జి.వి.ఆర్. ప్రసాదరాజు రావిశాస్త్రి సాహితి పుస్తకాన్ని విడుదల చేసి వివరాలను తెలియజేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో 29,30,31 జూలై 2022లో "రాచకొండ విశ్వనాథశాస్త్రి సాహిత్య సమాలోచనం" పేరుతో నిర్వహించిన మూడురోజుల అంతర్జాతీయ సదస్సుకు మంచి స్పందన వచ్చిందని అన్నారు. ఆ సదస్సులో ప్రముఖులు, సాహిత్యవేత్తలు సమర్పించిన పరిశోధన పత్రాలను సదస్సు కన్వీనర్ డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్ "రావిశాస్త్రి సాహితి" పేరుతో పుస్తకాన్ని తీసుకువచ్చారని చెప్పారు. మొత్తం 80వ్యాసాలతో, రెండు సంపుటాలుగా, ఐ.ఎస్.బి. ఎన్ నెంబర్ తో పూర్తి అకడమిక్ గా ఈ పుస్తకాన్ని తీసుకువచ్చారన్నారు. తెలుగుసాహిత్యానికి రావిశాస్త్రి విశేషకృషి చేసారని, శతజయంతిని పురస్కరించుకొని వారి సాహిత్యాన్ని ప్రజలకు అందించేందుకు కృషి చేసిన వరప్రసాద్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఈసీ మెంబర్ ఆచార్య కె.శ్రీరమేష్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, సదస్సు కన్వీనర్ డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్, సదస్సు కో కన్వీనర్లు డా.తలారివాసు, డా.టి.సత్యనారాయణ, డా.పి.ఎ.నాయుడు, డా. సిహెచ్ మురళీకృష్ణ, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



రావిశాస్త్రి సాహితి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ

# నన్నయ కార్యనిర్వాహక మండలి పదవీకాలం పొడిగిస్తూ ఉత్తర్వులు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కార్యనిర్వాహక మండలి పదవీకాలాన్ని మరో 60 రోజులు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2020 మార్చి 23వ తేదీన మూడు సంవత్సరాల కాల పరిమితికి కార్యనిర్వాహక మండలిని నియమిస్తూ ఉత్తర్వులు నెం47ను ప్రభుత్వం అప్పట్లో జారీ చేసింది. ఆ జీఓ ప్రకారం ప్రస్తుతం ఉన్న ఈసీ మెంబర్లు పదవీ కాలం మార్చి 22తో ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఈసీ పదవీకాలాన్ని మరో 60 రోజులు పొడిగిస్తూ జీఓ నెంబర్ 48ని ఉన్నత విద్యాశాఖ బుధవారం జారీ చేసింది.




# డిప్లమా ఇన్ కూచిపూడి కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఆధ్వర్యంలో డిప్లమా ఇన్ కూచిపూడి పార్ట్ టైం కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ తెలిపారు. శనివారం యూనివర్సిటీలో దీనికి సంబంధించిన వివరాలను రిజిస్ట్రార్ తెలియజేసారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఆధ్వర్యంలో డిప్లమా ఇన్ కూచిపూడి పార్ట్ టైం కోర్సును ప్రారంభిస్తున్నామని అన్నారు. ఏడాది కాలపరిమితితో 20 సీట్లతో అనుభవజ్ఞులైన అధ్యాపకురాలిచే డిప్లొమా కోర్సును నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్మీడియట్, డిప్లమా పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు మాత్రమే కోర్సులో చేరేందుకు అర్హులని చెప్పారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 3వ తేదీ నుండి 18వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ 0883-256611 / 9912662500 నెంబర్లును సంప్రదించగలరు. ఫీజు తదితర వివరాల కొరకు యూనివర్సిటీ వెబ్ సైట్ www.aknu.edu.inను సంప్రదించాలని తెలియజేసారు.




# తొలితరం స్త్రీవాద కథలు




**20వ** శతాబ్దం మొదటి దశకంలో తన తోటి స్త్రీలను చైతన్యపరచడానికి, స్త్రీవిద్య అవసరం,స్త్రీల స్వేచ్ఛ, స్వాతంత్రాల గురించి కలం పట్టి ఎన్నో ఆణిముత్యాల వంటి కథలను మనకు అందించిన రచయిత్రి కనుపర్తి వరలక్ష్మమ్మ. ఈమె ప్రధానంగా స్వాతంత్ర్య పోరాటం,గాంధీ ప్రభావం,స్త్రీ అభ్యున్నతితో కూడిన అనేక కథలను రాశారు.తొలితరం అభ్యుదయ కథకురాలిగా పేరొందిన వరలక్ష్మమ్మ 12 కథలను ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఒక పుస్తక రూపంలో తీసుకొచ్చారు.ఈ కథలన్నీ ఆనాటి సమాజాన్ని ప్రతిబింబిస్తూ భవిష్యత్ తరాలకు అవసరమైన సందేశాన్ని అందిస్తున్నాయి. తెలుగు నేలపై దేశీయ వస్త్ర వ్యాపారం గురించి,వాటిపై మొదటి ప్రపంచ యుద్ధ ప్రభావాన్ని ,స్వాతంత్ర పోరాటంలో నేత పరిశ్రమ కోసం ఒక కుటుంబం పడిన తాపత్రయం గురించి చెప్పిన కథ 'కుటీర లక్ష్మి'.అలాగే ఆంగ్లేయులకు సహకారం అందించిన తండ్రికి 'రావుసాహెబ్' బిరుదు,గాంధీ అడుగుజాడల్లో నడిచిన కొడుక్కి 'ఖైదు' అంటూ ఆనాటి పాలకుల ప్రభావం గురించి చెప్పిన కథ "ప్రేమ భావము".స్త్రీల హక్కులు, సామాజిక గౌరవము,భార్య భర్తల స్వభావం గురించి ఆసక్తి కథనంతో రాసిన "గౌరవస్థానము" వంటి అనేక కథలను ఎంతో ఆసక్తికరంగా సందేశాత్మకంగా రాశారు.అంతే కాకుండా కథ ఎలా ఉండాలి, దానివల్ల ప్రయోజనం ఏ విధంగా ఉండాలి,పత్రికల్లో వచ్చే వ్యాసాల తీరు వంటి అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పే ప్రయత్నం చేశారు "కథ ఎట్లా ఉండాలే"అనే కథలో. వరలక్ష్మమ్మ కథలలో ఎక్కువగా రాజేశ్వరి, రాఘవరావులే పాత్రలుగా కనిపిస్తారు. వారి సంభాషణల్లో స్త్రీ విద్య, స్త్రీపురుష సమానత్వం, మహిళాసభలు గురించి చర్చలు ఎక్కువగా ఉంటాయి.పురుషుడు భార్యను బానిసగా కాకుండా మిత్రురాలిగా చూడాలని శక్తివంతంగా చెప్పిన వరలక్ష్మమ్మ తెలుగునాట మహిళాభ్యుదయానికి కృషిచేసిన తొలి స్త్రీవాద చైతన్యవాది.ఉదాత్త భావాలు కలిగిన రచయిత్రి. ఆడవాళ్ళు చెప్పులు తొడుక్కొని వీధిలోకి వస్తే విడ్డూరంగా చూసే ఆ రోజుల్లో స్త్రీల కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేసి, స్త్రీలకు సందేశాత్మకంగా ఉండే కథలను రాసిన ఆ మహిళాదీపాన్ని గురించి మననం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

– బి.సుశాంత్ కుమార్

# మానవబాంబు - కొయిలీ

## (మనం మరచిన మనచరిత్ర)

**అది** తను తన భర్త కలిసి వైభవంగా నివసించిన కోట ! తాము రాజ్యమేలిన కోట ! నేడు బ్రిటిష్ నక్కల స్వాధీనంలో ఉన్నది ! తాను దానిని తిరిగి తన ఏలుబడిలోనికి తెచ్చుకొనవలె !

చాలా దూరం నుండి ఆ కోటను పరికిస్తున్న ఆ స్త్రీ మూర్తి హృదయంలో ఎన్నో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి !

ఆమె ఆలోచనా ప్రవాహానికి అడ్డుకట్టవేస్తూ గూఢచారిదళ ముఖ్యుడు పిలిచిన "అమ్మా" అనే పిలుపుతో ఈ లోకంలోకి వచ్చి పడ్డది ఆవిడ !

ఏమిటి సేతుపతి ఏమి వార్తలు తెచ్చావు ?...అన్నట్లుగా చూసిందావిడ !

అమ్మా ! మన దళాలు ఇప్పుడు ఒకఅడుగు ముందుకు వేసినా సర్వనాశనం తప్పదు ! జాగ్రత్తగా ఆలోచించి అడుగు కదపాలమ్మా అన్నాడతడు !!

ఎందుకు ? అన్నట్లుగా మరల చూపులతోనే ప్రశ్నించిందావిడ !

అమ్మా ! ఆంగ్లేయుల వద్ద అధునాతన తుపాకులు ఫిరంగులు ,బాంబులు ,మందుగుండుసామాగ్రి ఉన్నదమ్మా ! దానితో వారు సుదూరంగా ఉన్న లక్ష్యాలను కూడా ఛేదించగలరు ! మనవారు ఇప్పుడు ఎదురువెళ్ళడమంటే సరాసరి మృత్యుదేవత ఒడిలోకి వెళ్ళడమే !

మరిప్పుడు ఏమి చెయ్యాలి ? రాణి మదిలో తొలుస్తున్న ప్రశ్న ఇది ! ఎనిమిది సంవత్సరాలు అడవులలో ఉంటూ ఆకులు అలములు తింటూ చేసిన తన సుదీర్ఘ ప్రయత్నం వృధాకావలసినదేనా ? తన కష్టం బూడిదలో పోసిన పన్నీరేనా ?

తన భర్తను హత్యచేసిన బ్రిటిష్ వారికి తాను దొరకకుండా ఎనిమిది సంవత్సరాలు రహస్యంగా గడుపుతూ నిర్మాణం చేసిన తన సేన ఇలా ఎందుకూ కొరగాకుండా పోవలసినదేనా ?

కొయిలీ ఏది? ఎక్కడ ? పిలిచింది రాణి ! ఆవిడ శివగంగై మహారాణి "వేలునచ్చియార్" !

కొయిలీ !! తమిళనాడులోని శివమహాదేవుడిని కొలిచే వారి వారసులమని సగర్వంగా చెప్పుకునే సాంబవర్ తెగకు చెందిన స్త్రీ మూర్తి ! వీరవనిత!!! యుద్ధవిద్యలలో నిష్ణాతురాలు ! అందము ,తెగువ,తెలివితేటలు కలగలిసి ఒకరూపుదాలిస్తే వచ్చే రూపము "కొయిలీ" !

ఇక్కడే ఉన్నానమ్మా అంటూ వచ్చింది కొయిలి ! మహారాణి ఏ విషయమైనా కొయిలి తో చర్చించిగాని ముందుకు అడుగువెయ్యదు ! వీరనారీమణులతో ఏర్పడిన దళానికి అధిపతి కొయిలి !

కొయిలీ ఏంచేద్దాం ? మనము అల్లంత దూరాన ఉండగనే మనలను సర్వనాశనం చేయగల ఆయుధాలు బ్రిటిష్ వారివద్ద ఉన్నాయి ఇప్పుడెలా ?అడిగింది రాణి !గూఢచారదళ ప్రముఖుడిని మరల పిలిపించింది కొయిలి !

ఆ ఆయుధాలకు కావలసిన మందుగుండు సామాగ్రి ఎక్కడ దాస్తారు ? ఆ గిడ్డంగి ఎక్కడ ఉన్నది.ప్రశ్నించింది కొయిలి !

మన కోట లోనే రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం ప్రక్కన పెద్ద గోదాము నిర్మించి అక్కడ భద్రపరిచారమ్మా బదులిచ్చాడు గూఢచారి !

మందుగుండు సామాగ్రి నిలువ చేసిన గిడ్డంగిని మొదట స్వాధీనం చేసుకుంటే బ్రిటిష్ సైన్యాన్ని నిర్వీర్యులను చేయవచ్చని కొయిలి ఆలోచన !

కానీ ! కథ మొదటికొచ్చింది కోట స్వాధీనం కానిది గిడ్డంగిని వశపరచుకోలేము !

ఎలా ?

ఎలా స్వాధీనం చేసుకోవాలి కోటను ? ఎడతెరిపి లేకుండా రాణి తన అనుచరులతో మంతనాలు సాగిస్తూనే ఉన్నది !

శిబిరం లోనుండి కాసేపు బయటకు వచ్చింది కొయిలి !



కోటవైపు చూపు సారించింది ఆమె దృష్టిని ఒక విషయం ఆకర్షించింది!

వెంటనే క్షణమాలస్యం చేయకుండా ఆ వైపుకు పరుగులాంటి నడకతో వెళ్ళింది !

కొంతమంది ఆడువారు చేతిలో పూజాసామాగ్రి ఉన్న పెద్దపెద్ద పళ్ళేలు మోసుకుంటూ కోట వైపుగా సాగుతున్నారు !

ఎవరు మీరు అటువైపు ఎందుకు వెళుతున్నారు అని వారిని అడిగింది !

రేపు విజయదశమికదా అని బదులిచ్చారు వారు

అయితే ?

ఒక్క విజయదశమిరోజే కోటలోని రాజరాజేశ్వరిఅమ్మవారి ఆలయ ప్రవేశానికి అనుమతి ! ఆ ఒక్కరోజే చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలంతా ముఖ్యంగా ఆడువారు తరలివస్తారు ! ...అని బదులిచ్చారు ఆ భక్తులు !

అంతే ! మదిలో ఏదో ఆలోచన తళుక్కున మెరుపులా మెరిసింది ! ఎంతవేగంగా భక్తులను సమీపించిందో అంతకు రెట్టింపువేగంతో రాణిగారి శిబిరానికి దూసుకుంటూ వెళ్ళింది !

అమ్మా ! ఇలా చేద్దాం ! అని కొయిలీ చెప్పడమూ రాణి తల ఊపడమూ వెంటవెంటనే జరిగిపోయాయి !

తమదళ సభ్యులందరినీ సమావేశపరచింది మొయిలి తన ప్రణాళిక మొత్తం వివరించింది !

స్త్రీ సైనికులందరూ చక్కగా భక్తులవేషంలోకి మారిపోయారు ! తమతమ చీరల చాటున ఆయుధాలు దాచారు ! పూజాసామాగ్రితో కోటవైపు చిన్న చిన్న జట్లుగా మారి నడక సాగించారు !

మొదటి జట్టులో కొయిలి బయలు దేరింది ! చివరిజట్టులో రాణి చేరింది !

తాము ఎప్పుడు సూచన పంపితే అప్పుడు దాడికి తరలిరావలసిందిగా మిగతా సైన్యానికి తగు ఆదేశాలిచ్చారు వారు !

అందరూ కోటలోకి చేరారు ! అమ్మవారి ఆలయంలో అన్ని సేవలు అయిపోయేవరకూ ఎవరికీ అనుమానం రాకుండా పూజలు చేశారు !

తమ చుట్టూ పరిసరాలను అందరూ ఒక్కసారి గమనించారు ! సామాన్యభక్తులందరూ దాదాపుగా తిరిగివెళ్ళిపోయారు అని నిర్ధారించుకున్నారు !

ఎవరూ ఊహించనివిధంగా ఒక్కసారి కరవాలాలు బయటకు వచ్చాయి నిశిరాతిరిలో కత్తులు తళుక్కున మెరిశాయి పూజాపళ్ళేలుగా ఉన్న డాళ్ళు తమస్థానాలలోకి వచ్చాయి

వీర వనితలంతా రణశంఖం పూరించారు ! దొరికిన వైరిసైనికుడిని దొరికినట్లుగా తుదముట్టించారు !

ఏమి జరుగుతుందో తెలుసుకునేలోపు సగం మంది బ్రిటిష్ సైనికులు హతమయ్యారు !

వారందరూ పెద్దగా కేకలు వేసుకుంటూ తమతమఆయుధాలు, మందుగుండు దాచి ఉన్న గిడ్డంగి వైపు పరుగులు పెట్టడం గమనించింది కొయిలీ ! ఆమెకు తెలుసు ఆ గిడ్డంగి తెరుచుకొని ఆయుధాలు వారి చేతికి వస్తే అవే తమ ఆఖరుక్షణాలని !

ఆమె దృష్టి అమ్మవారిఆలయంలో కాంతులీనే దీపస్తంభాలపై పడింది ! వాటికి చమురుదివిటీలు ఉన్నాయి ! ఒక దివిటీని చేతిలోకి తీసుకుంది ప్రక్కనే ఆ దివిటీలు నిరంతరం మండటానికి అక్కడ ఒక గంగాళం నిండుగా నెయ్యి పోసి ఉన్నది !ఆలోచన వచ్చిందే తడవుగా ఆ నెయ్యితో తన శరీరాన్ని తడిపేసుకున్నది ! ఈమె చేయబోయే పని పసిగట్టాడొక బ్రిటిష్ సైనికుడు ఆమె ఎదకు గురిపెట్టి తుపాకి కాల్చాడు ఆ గుండు సరాసరి ఆవిడ ఎడమభుజంలోనుండి దూసుకు పోయింది ! బుస్సున రక్తం పొంగింది ! ఇంకొక తూటా కాలిలో దిగబడ్డది !

ఆమె వజ్రసంకల్పానికి అవేవీ అడ్డురాలేదు ! సంధించివిడిన బాణంలా రయ్యిన వెళ్ళి గిడ్డంగిలో జొరబడి తనకుతాను నిప్పంటించుకొని మందుగుండుసామాగ్రి మీదకు సివంగిలా దూకింది !

అంతే క్షణాల్లో బూడిదకుప్పగామారిపోయింది !

మరుక్షణంలో అక్కడ ఆయుధాలులేవు మందుగుండులేదు గిడ్డంగీలేదు అంతా బూడిద !

మరొకవైపు రాణి తన శక్తివంచనలేకుండా పోరాడుతూనే ఉన్నది ఈలోపు బయటి సైనికులు వచ్చి కలిశారు !

ఎంత వేగంగా మొదలయ్యిందో అంతే వేగంగా అంతమయ్యింది యుద్ధం !

బ్రిటిష్ దళపతికెప్టెన్ బెంజౌర్ పట్టుబడ్డాడు ! అతడికి సంకెళ్ళు వేసి రాణిముందు ప్రవేశపెట్టారు !

ప్రాణభిక్ష పెట్టమని అర్థించాడు వాడు ! రాణి వాడిని క్షమించి వదిలివేసింది !

శివగంగై కోట వేల్ నచ్చియార్ కు తిరిగి వశమయ్యింది !

చరిత్రలో ఒక స్త్రీమూర్తి మానవబాంబుగా మారి తనవారి దాస్యశృంఖలాలు తెంచిన వీరోచిత ఘట్టం ఈ యుద్ధంలో పురుడుపోసుకున్నది !

భారతదేశ చరిత్రలో స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకోసం మొదటిమానవబాంబుగా మారిన రణచండి "కొయిలీ"